# జరీ చీర

యం. వి. వి. సత్యనారాయణ

పాతకాలం నాటి జరీ చీర సన్నటి జరీ తీగల ముద్దలాగ ఆమె చేతుల్లోంచి ట్రంకు పెట్టెలోకి జారిపోయింది.

ఆ పట్టు చీర అంటే సుశీలమ్మకి ప్రాణం. అది పెళ్ళినాటి పట్టుచీర. తన భర్త తనకి పెట్టిన మొదటి, చివరి పట్టుచీర అది. అప్పట్లో అది నాచురంగులో వుండేది. ఇప్పటికి అది వెండి జరీతో ముడుచుకు పోయి వెలిసిపోయిన పేడరంగులోకి మారిపోయి వుంది.

అయినప్పటికీ ఆ పట్టుచీర అంటే సుశీలమ్మకి ప్రాణం. ఇప్పటికీ ఆచీర రెండు కిలోల పైనే బరువుతూగుతుంది. కనీసం ఒక కిలోగ్రాము వెండి ఇచ్చే పట్టుచీర అది. జరీ కరిగించి అమ్ముకుంటే ఆమె ప్రస్తుతం అనుభవిస్తున్న జీవితక్లేశాలు ఇంచుమించు సమసిపోతాయి కానీ, జరీ కోసం చీరను కాల్చిపారెయ్యడం ఆమెకు మనస్కరించడం లేదు.

యాభై ఏళ్ళ కిందటి పట్టుచీర అది!

ఆ చీరను ఎన్నిమార్లు మనసారా స్పృశిస్తూ గత జీవితపు మధురిమలు నెమరువేసు కోలేదు! అసలు ఇంత ముసలి వయసులో భర్త ఎటో వెళ్ళిపోయిన పదిహేనేళ్ళ కాలం తర్వాత కూడా ఆ మధురిమల రసాస్వాదనతోనే బతుకు వెళ్ళమారిపోతూంది.

భర్త ఎక్కడికి వెళ్ళిపోయాడో తెలియదు. పక్కనే వున్న విజయనగరం వెళ్ళివస్తానని చెప్పి బయల్దేరి వెళ్ళి మాయమైపోయాడు. ఆయన రేపువస్తాడు. మాపువస్తాడు అనే ఎదురుతెన్నులు చూస్తోంది సుశీలమ్మ. పదిహేనేళ్ళు పై చిలుకే అయ్యింది. అప్పట్నుంచీ తనకి అసలు పసుపుకుంకమలున్నాయో, లేవో, అర్థంకాని పరిస్థితి! మనసంతా మొండిబారిపోయింది.

పాతకాలం ట్రంకు పెట్టెకు బరువైన తాళం కప్ప వేసింది సుశీలమ్మ. ఆమె కట్టుకున్న కాటన్ చీరలతో బాటు తన పెళ్ళినాటి పట్టుచీర కూడా అదే పెట్టెలో లుంగలా చుట్టుకుని ఉండటం ఎంత బాగుంటుంది!

సుశీలమ్మ నిట్టూర్చింది. జ్ఞాపకాలకు తెరలుదించి, పెట్టెముందు నుండి నెమ్మదిగా లేచింది.

''నానమ్మా!...'' చిన్న మనవరాలు ఆమె కాళ్లను చుట్టేసింది.

సుశీలమ్మ మురిసిపోతూ మనవరాలిని ఎత్తుకుంది.

''బువ్వ తిన్నావా!'' అడిగింది సుశీలమ్మ.

మనవరాలు తల అడ్డం తిప్పి, ''అన్నయ్య బడికి వెళ్ళిపోయాడు కదా!'' అంది.

సుశీలమ్మ నవ్వింది.

మనవరాలు బువ్వ తినకపోవడానికీ, మన వడు స్కూలుకి వెళ్ళిపోవడానికీ సంబంధం మేమిటి!...

''పద! నేను బువ్వతినిపిస్తాను!'' అంటూ సుశీలమ్మ కదలబోయింది.



మనవరాలు నానమ్మను మరింత గట్టిగా వాటేసుకుని ''ఊహూ! నాకు పట్టుచీర యిస్తేనే!'' అంది రాగం తీస్తూ.

సుశీలమ్మ మొహంలో నవ్వుకళ మాయమై పోయింది.

తన పెళ్ళినాటి పట్టుచీర ఇంట్లో ఒక ప్రముఖ సమస్య అయిపోయింది. కొడుక్కి ఎప్పుడు డబ్బు అవసరం పడినా 'జరీ అమ్మేద్దాం అమ్మా!' అంటూ ప్రతిపాదిస్తాడు. కోడలు సరేసరి! ఇల్లు గడవని ప్రతి క్షణంలోనూ పట్టుచీరలో వున్న వెండి జరీ గురించి ప్రస్తావిస్తుంది.

ఆ మాటకొస్తే ఇల్లు గడవడం చాలా కష్టంగానే ఉంది. కాని, పట్టుచీర జరీ ఎంత వరకూ ఇంటి అవసరాలు తీర్చగలదు! కొడుకు కష్టపడతాడు. అందులో ధోకాలేదు. కాని కష్టపడిందంతా తన పాడు పొట్టకే తాగేస్తాడు. ఒకప్పుడు సారా ఉండేది. ఇప్పుడు కల్లు. కుండలకు కుండలు తాగేవాడు సంసారాన్ని ఎక్కడ ఈడ్చుకు రాగలడు? అయితే వాడికి జరీ అమ్మి సాయపడాలని కూడా

తనకనిపించదు.

తాగుడు మాని సంసారాన్ని బాగు చేసుకోమనే తాను చెబ్తుంది. ఈరోజు తానుంటుంది. రేపటికి ఉంటుందో, ఉండదో ఎవడు చెప్పగలడు! తనక్కూడా ఒంట్లో అంత బాగుండటం లేదు.

వాడి తర్వాత పుట్టిన అమ్మాయి కాకినాడలో వుంది. తన దగ్గరకు వచ్చి ఉండమంటుంది అమ్మాయి. ఎక్కడోచోట రెండు ముద్దలు తింటే తన బతుకు వెళ్లమారిపోతుంది. అమ్మాయి దగ్గరికి బయల్దేరాలి.

''చూశావా నాన్నమ్మా! పట్టుచీర అంటే మాట్లాడవుమరి! అమ్మచెప్పిన మాట నిజమే!''

సుశీలమ్మ ఈసారి నిజంగానే నొచ్చుకుంది. తనగురించీ, తన పట్టుచీర గురించి కోడలి కెలాంటి మహత్తరమైన అభిప్రాయాలున్నదీ తనకి తెలుసు. చివరికి పిల్లల మనస్సులు కూడా ఖరాబు చేస్తోందన్నమాట కోడలు. చిన్నపిల్లలకు ముది మాటలేం బాగుంటాయి!

''ఏం చేసుకుంటావే లుంగలు చుట్టుకు పోయిన పట్టుచీర! వెలిసిపోయిన రంగు!'' అంది సుశీలమ్మ, నిర్వికారంగా.

మనవరాలు ఏదో మాట్లాడబోయింది కాని..సుశీలమ్మ ఆ పిల్లకా అవకాశం యివ్వకుండా వంటింటి వైపు లాక్కుంటూ పోయింది. వంటింట్లో కోడలు బియ్యం ఏరుకుంటూ కనిపించింది.

''చిన్న గిన్నెలో అన్నం పెట్టి వుంచాను. తినిపించు అత్తయ్యా...'' అంది కోడలు.

సుశీలమ్మ తలూపి చిన్నగిన్నె అందుకుని మనవరాలికి గోరుముద్దలు తినిపించడం మొదలు పెట్టింది. మనవరాలు మాత్రం ఈలపాట రాగంలో పట్టుచీర గురించి గునుస్తూనే వుంది.

''ఒక్కసారి ఇవ్వవలసిందత్తయ్యా, ఊరు కోవే... పట్టుచీర ఇస్తుందిలే నాన్నమ్మ.'' అంది కోడలు.

సుశీలమ్మకి కోపం ముంచుకొస్తోంది. కోపం తాలూకు విసుగు ఆమె కలుపుతున్న గోరుముద్దల్లో ప్రతిఫలిస్తోంది.

''ఏం చేసుకుంటావ్... అసలు ఆ చీరే పీచు మిఠాయి లాగా వుంది!'' అంది కోపం దిగమింగుకునే ప్రయత్నంలో.

''ఒకసారి ఇవ్వవచ్చుకదా!''

తలతిప్పి చూసింది సుశీలమ్మ.

కొడుకు!

బట్టలనిండా కల్లు ఒంపుకొన్నట్టున్నాడు- ఒకటే పులిసిన వాసన కొడ్తున్నాడు.

సుశీలమ్మకి కోపం తిరిగి ముంచుకొచ్చింది.

''కడవలక్కడవలు తాగకపోతేనేం-'' అంది ఈసడింపుగా.

కొడుకు ఆమె కోపాన్ని తేలికగా తీసుకుని, అసలక్కడికి వెళ్ళబట్టేగదా నాన్న అక్కడే ఉన్నాడని తెల్సింది!'' అన్నాడు.

సుశీలమ్మ నోరావులించి ఇక అలాగే వుండిపోయింది. కొడుకు మాటలు అర్థమయ్యేటప్పటికి ఆమెకు చెవులు దిబ్బలు పడ్డాయి. కళ్ళుపచ్చబడ్డాయి. ఒళ్ళంతా చెమటలు కమ్మాయి.

కొడుకు ఏమంటున్నాడు!

నాన్న-

ఎప్పటి నాన్న? అయిదా..పదా..! పదిహేను సంవత్సరాలయ్యింది ఆయన ఇంట్లోంచి

వెళ్ళిపోయి! ఇప్పుడు ఎక్కడ్నించి ఊడి పడ్డారు! అయినా కొడుకు అతడ్ని ఎలా గుర్తుపట్టాడు?

కొడుకు వెనక్కి తిరిగి మధ్య గదిలోకి చూసి, ''అదిగో! అక్కడ కూర్చోబెట్టాను.'' అన్నాడు.

సుశీలమ్మ నెమ్మదిగా చైతన్యంలోకి వచ్చింది. అన్నంగిన్నెను అలాగే నేలమీద వదిలిపెట్టి లేచి ఎంగిలి చేత్తోనే కదిలి మధ్యగదిలోకి వెళ్ళింది.

తన కళ్ళను తానే నమ్మలేకపోయింది సుశీలమ్మ.

ఆయనే! అయితే వయస్సూ, దరిద్రమూ ఆయన మీద విపరీతంగా దాడి చేశాయి. మనిషి నొక్కుకుపోయాడు. కానీ అతడే తనభర్త అనే పోలికలు చాలా ఉన్నాయి. పైగా అబ్బాయి పొరబడి ఉండడు కదా!

ఎలా పలకరించడం! సంవత్సరాల తరబడి పేరుకపోయిన స్మృతులపుటల్ని ఒకేసారి ఎలావిప్పడం! సుఖదుఃఖాల అనుభూతుల పరంపరల్ని ఆయనతో కలసి ఒకేసారి పంచుకోవడం ఎలా! ఆయన ఎడబాసిన ఈ సుదీర్ఘ సంవత్సరాల విశేషాలు ఎన్నని అడగడం...! వయసు మీద పడిపోయి సిగ్గు ముప్పిరి కొంటూంటే-

అది ఆవేశమో, దుఃఖమో, అసహాయతో, తన మీద తనకే జాలో ఆమెకు తెలిసేలోగానే సుశీలమ్మ ఆ ముసలాయన పాదాల దగ్గర కుప్పకూలిపోయింది.

★ ★ ★

''నాన్నగారెక్కడ!'' అడిగాడు కొడుకు.

అతడికి తల్లి మొహంలో కొత్త వెలుగు కనిపించింది. వెలుగుతో బాటు అర్థంకాని ఆరాటం, ఏదో పారేసుకున్నట్టు తడబాటూ-

మందహాసం చేశాడు కొడుకు.

కొడుక్కి నీళ్ళగది చూపించి అడుగులు తడబడ్తుండగా పెరట్లోకి వెళ్ళింది సుశీలమ్మ.

అంతకుముందే కోడిని కోశాడు కొడుకు.

సన్నికల్లు ముందు కూర్చుని మషాలా నూరుతోంది సుశీలమ్మ.

''నాన్నగారికి ఉతికిన లుంగీ ఇవ్వలేక పోయావా!''

కొడుకు మాటలు వింటోంది సుశీలమ్మ. తండ్రి మీద అతడికి ఇంత అభిమానం ప్రేమా ఉన్నాయని ఆమె వూహించలేదు. తనకింకా రెక్కలు సమకూర్చుకుండానే తండ్రి ఎటో మాయమైన కోపం అతడిలో ఉంటుందను కుంది సుశీలమ్మ.

## పిల్లాడు

''డాక్టర్ గారూ- నాకిప్పుడు మూడో నెల. రోజూ పేకాడాలని, బ్రాందీ తాగాలని, సిగరెట్ కాల్చాలని కోరిక కలుగుతుంది'' చెప్పింది తాయారు.

''అయితే మీకు తప్పకుండా మగపిల్లాడే పుడతాడు'' చెప్పింది డాక్టర్.

- చిలకంటి బాబూరావుపంత్లు
(మల్లికల్)

అలాంటి కోపం ఏదీ లేకపోగా తండ్రిమీద అంతటి ఆదరం కురిపిస్తోన్నందుకు కొడుకుమీద విపరీతమైన వాత్సల్యం పుట్టుకొచ్చింది.

వాడు తాగొస్తే తాగొచ్చాడు. చివరికి తనపట్టుచీర కూడా కరగబెట్టుకుని తాగెయ్యాలని చూస్తే చూశాడు!

కాని ఏనాడో తప్పిపోయిన తండ్రిని ఆదరంగా దగ్గరకి తీసుకోవడం ఎంత ముచ్చటగా వుంది!

ఇల్లంతా కొత్తకళతో కొట్టుమిట్టాడుతోంది.

కోడలు వంటింట్లో గారెలు వండుతోంది.

కోడి, గారెలు అన్నీ అంతా అప్పు సొమ్ముతోనే. అయితే ఏంగాక! ఇలాంటి మధుర ఘడియలు ఇంట్లో రాజ్యం చేసి ఎంత కాలమయ్యిందో-

ఆరాత్రి ఇంట్లో అందరికీ మృష్టాన్న భోజనమే!

మగాళ్లకి మాత్రం తాగుడు అదనంగా సమకూడిన సదుపాయం!

''అప్పు ఎలా తీరుస్తారు!'' అడిగింది కోడలు.

సుశీలమ్మకి వినిపిస్తోంది.

''అప్పుతీరకేం చేస్తుంది!'' అన్నాడు కొడుకు.

''మీరు తీర్చాలి కదా!''

''ఛ.. నీకెప్పుడూ ఒకటే గోల!''

''ఇల్లు ఎలా గడుస్తుందో మర్చిపోయారా!''

''నువ్వేం బాధపడక!''

''నాకేం లెండి! వడ్డీలు కట్టుకునేది మీరు కదా!'' తర్వాత కోడలు అటు పక్కకి తిరిగి పండుకుంది.

సుశీలమ్మ నెమ్మదిగా లేచి, తనట్రంకు పెట్టె తెరచి చూసుకుంది. ఎండిన పేడముద్దలాగ ముడుచుకు పోయిన పట్టుచీరమీద ముసలి వెంట్రుకల్లాగ వెండి జరీ మెరుస్తోంది.

సుశీలమ్మ తృప్తిగా నవ్వుకుంది.

తన పెళ్ళినాటి స్మృతులూ-దీర్ఘ వియోగం తర్వాత భర్త తిరిగి ఇంటికి రావడం అంతా ఈ పట్టుచీరను భద్ర పర్చుకోవడం వల్లే సాధ్యమైనట్లు ఆమె నమ్మకం.

పదిహేనేళ్ళ తర్వాత, తన సౌభాగ్యం చెక్కు చెదరకుండా 'నీవు ముత్తయిదువే!' అని నిరూపించిన మంగళ సూత్రాన్ని లెక్కలేనన్నిసార్లు కళ్లకద్దుకుని మురిసిపోయింది సుశీలమ్మ.

భర్త అటువైపు మంచం మీద గురకపెట్టి నిద్రపోతున్నాడు.

కొడుకూ కోడలు వెనుకగదిలో ఉన్నారు.

మనవరాలు సుశీలమ్మ డొక్కలోకి దూరిపండుకుంది. ఎప్పుడు నిద్రపట్టిందో ఆమెకీ తెలియదు.

ఎక్కడో అలికిడి!

ఎవరెవరో లేచి తిరుగుతోన్న హడావుడి! దీనంతటికీ వెనక తన కొడుకు ఎవరో ఆకాశరామన్నతో కలిసి నాటకమాడిన వ్యవహారం ఆమెకు అర్థమయ్యేలోగా ఆమె పట్టుచీర ఒక రహస్య స్థలంలో అంటుకుని మండుతూ జరీముద్దగా మిగుల్తోంది.

★